PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :197 | పేజీలు : 8 | వెల రూ.5 | శనివారం 08.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాత సూర్యుడు చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. IIHT ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# చేనేత దుస్తులు కొనండి

## నేతన్నలకు అండగా నిలవండి

- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని పిలుపు
- ప్రతి ఒక్కరూ కనీసం ఒక చేనేత వస్త్రం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి
- చేనేత ఉత్పత్తులను సోషల్ మీడియాలో షేర్ చేయాలి

## నేతన్నల ప్రతిభను ప్రపంచానికి చాటాలన్న మోదీ



ఢిల్లీ, ప్రభాత సూర్యుడు దేశంలో నేతన్నల కటుంబాలకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని ప్రజలకు ఆయన స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్టా లో వీడియోను విడుదల చేశారు. చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని వారిని కోరారు. దేశ ప్రజలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వదేశీ ఉద్యమ స్పూర్తిని గుర్తుచేస్తూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేసిన మోదీ, అదే ఉద్యమం ఆత్మనిర్భర్ భారత్‌కు పునాదులు వేసిందన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా స్వదేశీ వస్తువుల్ని ప్రోత్సహించడం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల, స్నేహితుల దినోత్సవాన్ని యువత ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నట్లే అదే స్థాయిలో జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలోని లక్షలాది మంది నేత కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలంటే ప్రతీ ఒక్కరు కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలని కోరారు. చేనేత వస్త్రాలు, ఉత్పత్తుల్ని కొనుగోలు చేసిన తర్వాత, వాటి వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోవాలన్నారు. దీని ద్వారా చేనేత కార్మికులు ప్రతిభ, నైపుణ్యం, సంప్రదాయ చేనేత కళ ప్రపంచానికి తెలుస్తుందని చెప్పారు. చేనేత ఉత్పత్తుల్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ఆత్మనిర్భర భారత్ లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు.



# నాగార్జునసాగర్‌లో..

# వరుణ యాగం

## ఈనెల 10 నిర్వహణకు సన్నాహాలు

- రాష్ట్రంలో సమృద్ధిగా వర్షా లు కురవాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం
- విజయవిహార్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాగం
- సాయంత్రం పూర్ణాహుతిలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

రాష్ట్రంలో విస్తారంగా వర్షా లు కురిసి కృష్ణా, గోదావరి నదులు, జలాశయాలు, చెరువులు జలకళ సంతరించుకోవడంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతుల సూచనల మేరకు ఆగస్టు 10న వరుణ యాగానికి శుభ ముహూర్తంగా నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు నిర్వహించనున్నారు.

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

### వేదపండితుల ప్రత్యేక సంకల్పం..

ఈ సందర్భంగా రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు నిండిపోవాలని, రైతాంగానికి మేలు కలగాలని వేదపండితులు ప్రత్యేక సంకల్పంతో యాగం నిర్వహిస్తారు. రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వరుణ యాగం జరగనుంది. సాయంత్రం జరిగే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

## ఇంటి ముంగిటకే పౌర సేవలు: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాత సూర్యుడు నగరంలోని బేగంపేటలో GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్' కార్యక్రమాన్ని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘనంగా ప్రారంభించారు. పాలనలో ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంపై నిర్వహించిన ఈ సదస్సులో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్యకుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా.దేవేష్ త్యాగి, అలాగే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ వంటి ప్రముఖ అధికారులు పాల్గొని తమ ఆమోదయోగ్యమైన సలహాలు, అభిప్రాయాలను పంచుకున్నారు.



# మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..**
**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ దనుంజయ్**



మల్లాపూర్, ఆగస్టు 07 ప్రభాత సూర్యుడు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నాచారం పోలీస్ స్టేషన్ సీఐ దనుంజయ్ సూచించారు. మల్లాపూర్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్--1 గురుబెల్లి సోమశంకర్ సునీల్ బాబు ఆధ్వర్యంలో, ఎస్ఎస్ఎస్ యువసేన సహకారంతో నాచారం పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ భద్రత, మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ దనుంజయ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగ పరిమితులను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కోరారు. అలాగే ఎస్ఐ మైబెల్లి మాట్లాడుతూ, మహిళలను గౌరవించడం, వారి భద్రతకు సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, లింకులు, సందేశాలను నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొని పోలీసు అధికారులతో పరస్పర చర్చ నిర్వహించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మామిడాల సంతోష్ రెడ్డి, బాలరాజ్, కపర సాయి, గురు, అక్షంత్ పడాల, జోషిత్ యాదవ్, రామ్ పుప్పాల, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ.




దుమ్ముగూడెం ఆగస్టు 7 ప్రభాత సూర్యుడుభద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యామండలి. అందజేసిన ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సి.హెచ్. కృష్ణవేణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే, త్వరలోనే కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఉచిత అల్పాహారం మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు, అదేవిధంగా విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు కూడా త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం గ్రామ సర్పంచ్ శ్రీమతి పద్మ, గ్రామ కార్యదర్శి నరేష్, కళాశాల అభివృద్ధి కమిటీ (జణజ) సభ్యులు కొత్తూరి సీతారామారావు, మహమ్మద్ హుస్సేన్ పాల్గొని విద్యార్థులను ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రేరణాత్మక సందేశాలు అందించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..




# కలెక్టరేట్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ..**
**ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది**

మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ ఆగస్టు 07 ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర పండుగగా జరుపుకునే బోనాల ఉ





త్సవాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా కలెక్టరేట్‌లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో వేడుకల్లో హాజరయ్యారు. పోతరాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా బోనాలను ఊరేగింపుగా కార్యాలయం నుంచి ఆలయం వరకు తీసుకువెళ్లారు. అనంతరం మహిళా సిబ్బంది భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



# ఆగస్టు 9 న ప్రపంచ ఆదివాసి దినోత్సవం జయప్రదం చేయండి

**ఆదివాసి చట్టాలు జోలికొస్తే ఊరుకోం**
**టిఎజియస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య**

దుమ్ముగూడెం ఆగస్ట్ 7 ప్రభాత సూర్యుడు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 2వ తేదీ నుండి 12వ తేదీ వరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాల భాగంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం మండలంలో ములకపాడు సెంటర్ నుండి ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయం వరకు భారీ ప్రదర్శన అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చెప్పటం జరిగింది స్థానిక డిప్యూటీ తాసిళల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది తర్వాత ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో కి వినతి పత్రం సమర్పించడం జరిగింది అనంతరం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు కంగల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ ఆదివాసి హక్కులు జోలికొస్తే ఊరుకోం అని ఈ సందర్భంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు హెచ్చరిక చేశారు, ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు, జీవో నెంబర్ 3 ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డినెన్స్ ద్వారా చట్ట రూపకల్పన చేయాలని ఆయన డిమాండ్ చేశారు, 2006 ఆ టీవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఆదివాసీలు సాగు చేస్తున్న భూములకు హాక్కుపత్రాలు ఇవ్వాలని. ఆదివాసీల పైన ఫారెస్ట్ దాడులు ఆపాలని. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఆదివాసీలకు షెడ్యూల్ కులం సర్టిఫికెట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఏజెన్సీ ప్రాంతంలో 5వ షెడ్యూల్ ప్రాంతంలో అన్ని హక్కులు ఆదివాసీలకే ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఫీసా చట్టం ప్రకారం గ్రామ సభలో ఆమోదం తీసుకున్న తర్వాత అరులైన ఆదివాసీలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఎన్ ఆర్ ఈజీఎస్ సిసి రోడ్లు అన్ని గ్రామపంచాయతీలకు ఇవ్వాలని ఎంపీడీవో నీ నిలదీశారు. లేదంటే రానున్న లేదంటే భవిష్యత్తులో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి సరియం కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కార్యదర్శి మర్మం చంద్రయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ కొమరం చంటి, ఆదివాసి సర్పంచులు సరియం రాజమ్మ, తుర్రం నవీన్ కుమారా నవీన్ కుమార్, కొమరం శాంతమ్మ, సోడి శ్రీనివాసరావు, మడకం మహేంద్ర నాథ్, మడివి అర్జున్, సవలం పుల్లయ్య, మడకం నందయ్య,వేట్టి ఇరమయ్య, కన్నయ్య ,జోగయ్య, రవ్వ దేవా,పాయం హరిబాబు, కొర్సా నాగరాజు, ములకనపల్లి పటేల్, సవలం శ్రీను, అపక రంగయ్య ఇంకా తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని అధికారులు ఆదివాసి సంఘాల ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి విజయవంతం చెయ్యాలి

**సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్**

భద్రాచలం ఆగస్టు 7 ప్రభాత సూర్యుడు ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి గౌరవ శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్లతో పాటు జిల్లా అధికారులు, వివిధ ఆదివాసి సంఘాల ప్రతినిధులు పాల్గొనే కార్య క్రమాన్ని విజయవంతంగా నిర్వహించి జయప్రదం అయ్యే విధంగా సంబంధిత గిరిజన ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు.శుక్రవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆదేశాల మేరకు గిరిజన ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు మరియు అధికారులతో ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు ఆదివాసి గిరిజనుల సాంప్రదాయ ప్రకారము ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, ఆదివాసి వంటకాలతో వారిని ఆనందింప చేసే విధంగా కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వచ్చే అతిధులకు మనమిచ్చే ఆతిథ్యంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సభ్యులకు సూచించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం వివిధ ఆదివాసి తెగల గిరిజనులతో ర్యాలీలు మరియు మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించడం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై చాయి చిత్ర ప్రదర్శనశాలలో ఏర్పాటులు చేయాలని ,ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులతో పాటు ప్రజలకు ఆదివాసి వంటకాలతో భోజన సౌకర్యం కల్పించాలని సంఘ సభ్యులకు తెలిపారు. అలాగే వివిధ తెగల సాంప్రదాయానికి సంబంధించిన సాంస్కృతిక నృత్యాలు ఏర్పాటు చేసి కనువిందు చేయాలని అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో పనిచేయుచున్న యూనిట్ అధికారులు మీకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తిచేసి ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు.



# హైదరాబాద్ సమీపంలో ఎమ్మెల్యే వెంకటరావు కారును ఢీ కొట్టిన లారీ..

**తప్పిన ప్రమాదం, అస్వస్థకు గురైన ఎమ్మెల్యే వెంకట్రావు**




భద్రాచలం ఆగస్టు 7 ప్రభాత సూర్యుడు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హైదరాబాదు వెళుతున్న క్రమంలో పతంగి టోల్‌గేట్ సమీపంలో వేగంగా దూసుకు వచ్చిన లారీ టోల్గేట్ వద్ద ఆగి ఉన్న ఎమ్మెల్యే వెంకటరావు కారుని ఢీ కొట్టడం జరిగింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే వెంకటరావుకి సురక్షితంగా బయటపడినప్పటికీ, ఒకసారిగా లారీ ఢీకొనడంతో కొంత అస్వస్థకు గురైనట్లు తెలుస్తుంది. కాగా ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే వెంకట్రావు వాహనం ఒకవైపు దెబ్బతిన్నది. పెను ప్రమాదం తృటిలో తప్పడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది....

# ఆగస్టు 9న ప్రతి గూడెంలో పచ్చ జెండా ఎగురవేయాలి: ఆదివాసీ జేఏసీ

**ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జెఏసి పిలుపు**

ములుగు ఆగస్టు 7 ప్రభాత సూర్యుడు వెంకటాపురం మండలంలో శుక్రవారం ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జెఏసి ఆధ్వర్యంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మండల వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేసి బోధపురం గ్రామంలో ఆదివాసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాని సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జెఏసి నాయకులు పూనేశీ రామచందర్ ,పూనెం సాయి దొర మాట్లాడుతూ ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ప్రతి ఆదివాసి గూడెంలో పచ్చ జెండాలు ఎగురవేయాలని ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని ఆదివాసి ప్రజానీకానికి పిలుపునిచ్చారు. 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 పిసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల పెత్తనం చెల్లదని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఏజెన్సీ ఏరియాలో 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు.ఏజెన్సీ ప్రాంతం నుండి గిరిజనేతరులను మైదాన ప్రాంతాలకు తరలించాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పిసా గ్రామ సభల ద్వారానే పార్లమెంటు చట్టమైన 1/70 చట్టాన్ని 5 వ షెడ్యూలు భూభాగంలో పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3 నీ పునర్దించి ఏజెన్సీ ప్రాంతంలో 3 జీవో ప్రకారం గా 100/: శాతం ఉద్యోగా లు ఆదివాసీలకే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు 1/70చట్టం అమలుకై నిరసన కార్యక్రమం తెలపాలని అన్నారు. ఈకార్యక్రమంలో బోధపురంగ్రామ ప్రజలు, యువత, ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కనీతి వెంకటకృష్ణ, కుంజ మహేష్,వాసం,నారాయణ, ఉండం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# జైలు భరోతో పేదల సత్తా చూపాలి -- వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు



సింగరేణి ఆగస్టు 07 ప్రభాత సూర్యుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. కార్మిక, కర్షక, రైతు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదిన నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువస్తోందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా కొత్త బిల్లులను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలను దూరం చేస్తోందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పిస్తున్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదల సత్తా చాటాలని కోరారు.

# జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

## నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే

## ప్రజా ప్రభుత్వంలో చేనేతకు మరింత గౌరవం నేతన్నలకు మరింత భరోసా

## వారం లో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలి





ములుగు ఆగస్టు 7 ప్రభాత సూర్యుడుచేనేత రంగానికి మరింత గౌరవం, నేతన్నలకు నిరంతర ఉపాధి, చేనేత ఉత్పత్తులకు మరింత మార్కెట్ కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అన్నారు. వ్యవసాయం, చేనేత రంగాలు తమ ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని ఆమె పేర్కొన్నారు. చేనేత కార్మికుల కష్టానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చేనేత వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, మాజీ ఎంపీ గుండు సుధారాణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు. పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు తయారు చేసిన చేనేత చీరలు, వస్త్రాలను ఆమె పరిశీలించారు. స్వయంగా మగ్గం నేసి నేతన్నల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. చేనేత చీరలను కొనుగోలు చేసి, ప్రజలు కూడా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. చేనేత కళాకారులు, ప్రముఖులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు, ముఖ్యంగా తెలంగాణ నేతన్నలు, నేతమ్మలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయం తర్వాత అధికంగా కష్టపడేది నేతన్నలేనని అన్నారు. ఒక చీర వెనుక కేవలం నూలుపోగులు మాత్రమే ఉండవని, ఒక కుటుంబం ఆశ, నేతన్న నైపుణ్యం, తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ఉంటుందని చెప్పారు. నరుడికి నాగరికత నేర్పింది నేతన్నలేనని మంత్రి సీతక్క అన్నారు. మనిషి వస్త్రాన్ని నేయడం, ధరించడం ప్రారంభించినప్పుడే నాగరిక సమాజానికి నాంది పడిందని తెలిపారులి. నేతన్న నూలుపోగు మన నాగరికతకు చిహ్నమని, చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది మన సంస్కృతికి ప్రతీక, సంప్రదాయానికి చిరునామా అని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని కేవలం సంక్షేమ కోణంలో కాకుండా ఉపాధి, ఆర్థికా భివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ కోణంలో ప్రభుత్వం చూస్తోందన్నారు. నేతన్నల కష్టం వృథా కాకుండా నిరంతర ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల విలువైన ఇందిరమ్మ చీరల ఆర్డర్లను చేనేత కార్మికులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దీంతో వేలాది నేత కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని కూడా చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు.

ప్రతి ఏడాది కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం ద్వారా చేనేత రంగానికి బలమైన మార్కెట్ కల్పిస్తున్నామని తెలిపారు.తగతంలో పేరుకుపోయిన నేతన్నల బకాయిలను కూడా తమ ప్రభుత్వం విడతల వారీగా చెల్లిస్తోందని సీతక్క చెప్పారు. చేనేత రంగం అభివృద్ధి, సంక్షేమం కోసం ఇప్పటికే సుమారు రూ.1,300 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేతకు మరింత గౌరవం, మార్కెట్, భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.నేతన్నల చేతుల్లో నూలు చక్రం నిరంతరం తిరిగితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని మంత్రి అన్నారు. చేనేత బతికితే వేలాది కుటుంబాలు బతుకుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా చేనేతకు తమ వంతు మద్దతు ఇవ్వాలని కోరారు.వారంలో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సీతక్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను కూడా చేనేత దుస్తులు ధరించడానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.



పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అంటే ఒక నేత కుటుంబానికి అండగా నిలవడమేనని అన్నారు.చేనేతను ఆదరించడం అంటే మన సంస్కృతిని గౌరవించడమేనని, నేతన్నలను
ప్రోత్సహించడం అంటే గ్రామీణ భారతాన్ని బలోపేతం చేయడమేనని మంత్రి సీతక్క అన్నారు. అందరం చేనేతను ఆదరించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.

# ఆటో డ్రైవర్లకు మంత్రి సీతక్క భరోసా

### 50 మందికి రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీలు అందజేత



ములుగు ఆగస్టు 7 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క 50 మంది ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ పాలసీ బాండ్లను అందజేశారు. పోస్టాఫీస్ ద్వారా అందించే ఈ ప్రమాద బీమా పథకంతో ప్రమాదవశాత్తు ఏదైనా అనుకోని సంఘటన చోటుచేసుకుంటే రూ.15 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని మంత్రి తెలిపారు.ఆటో డ్రైవర్లు ప్రతిరోజూ ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్నారని, వారి సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ప్రమాదాలు అనుకోకుండా సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా ప్రమాద బీమా కలిగి ఉండాలని సూచించారు.ప్రమాద బీమా పాలసీ ద్వారా డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, అనుకోని ప్రమాద సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని కొంతవరకు తగ్గించవచ్చని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఆటో డ్రైవర్లు బీమా పాలసీని సద్వినియోగం చేసుకోవాలని, తమ కుటుంబాల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించుకునేందుకు ముందుకు రావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంద్రకోట సుధీర్ యాదవ్, జిల్లా, మండల నాయకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు

# కారేపల్లి గ్రామపంచాయతీలో పరిసరాల పరిశుభ్రత.

### ప్రతి వీధిలో చిత్త, చెదారం శుద్ధి.



సింగరేణి ఆగస్టు 07 ప్రభాత సూర్యుడు కారేపల్లి గ్రామపంచాయతీలో 12 వార్డులు ఉండగా సర్పంచ్ మేదరి టోనీ, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, గ్రామ సెక్రెటరీ నెహ్రూ,వార్డు సభ్యులు సహకారంతో గత కొద్ది రోజుల క్రితం నుండి ప్రతి వార్డు ప్రతి వీధిలో పరిసరాలు పరిశుభ్రత చేపట్టారు. రహదారికి ఇరువైపులా అపరిశుభ్రంగా ఉన్న చెత్త, చెదారం శుభ్రం చేస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డు ఉన్న చెట్టుకొమ్మలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ టోనీ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ మొదలుకాడంతో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ప్రతి వార్డులోనే ప్రతి వీధిని శుభ్రపరుస్తున్నట్లు దోమలు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ప్రతి కుటుంబం వారి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకొని అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు

# కీసరగుట్టలో వైభవంగా శాఖాంబరీ దేవి అలంకరణ



కీసర, ఆగస్టు 07 ప్రభాత సూర్యుడుకీసరగుట్టలోని శ్రీ భవాని శివ దుర్గ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం భవాని శివ దుర్గా అమ్మవార్లకు శాఖాంబరీ దేవి అలంకరణను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కట్ట సుధాకర్ రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ నారాయణ శర్మ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలరామాశర్మ, రవికుమార్ శర్మ, రవికాంత్ శర్మ, నాగసాయినాథ శర్మ, వీరేశం శర్మ, ప్రణీత్ శర్మ, భరత్ శర్మ తదితరులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శాఖాంబరీ దేవి అలంకరణలో అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# అంగన్వాడీలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.

సింగరేణి ఆగస్టు 07 ప్రభాత సూర్యుడు .ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సింగరేణి మండల పరిధిలోని చీమలపాడు సెక్టర్ పరిధిలో అంగన్వాడి కేంద్రం నందు ప్రపంచం తల్లిపాల వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ రమణ గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించడం ఎంతో అవసరమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు తొలి ఆహారం, తొలి టీకా, ప్రకృతి ప్రసాదించిన అమృతమని పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా తల్లులు తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని, శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం... మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## అర్హులందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు

## ఆగస్టు 15 నుంచి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆసరా పింఛన్లు

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి.

ఖమ్మం/తిరుమలాయపాలెం, ఆగస్టు 07 ప్రభాత సూర్యుడుఅర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండలం లో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తిప్పారెడ్డి గూడెం గ్రామంలో రూ.2.10 కోట్ల వ్యయంతో తిప్పారెడ్డిగూడెం నుండి రాకాసి తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, హైదర్ సాయిపేట గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవననిర్మాణానికి, పాతర్లపాడు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి, రాజారాం గ్రామంలో 4 కోట్ల 50 లక్షలతో రాజారాం నుండి తుమ్మగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తిప్పారెడ్డిగూడెం గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.35.55 కోట్లు, హైదర్ సాయిపేట గ్రామానికి రూ.37 కోట్లు, పాతర్లపాడు గ్రామానికి రూ.29.25 కోట్లు,రాజారాం గ్రామానికి రూ.8.48 కోట్లు మంజూరు చేసి అంతర్గత సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, వంతెనలు, ఇతర మౌళిక వసతుల కల్పనకు పనులు చేపట్టినట్లు తెలిపారు.హైదర్ సాయిపేట గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని స్వచ్ఛందంగా అందించిన శ్రీనుకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు



చేయలేదని, కానీ తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి వాటి ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం ద్వారా వారి కుటుంబాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందన్నారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న పరిస్థితులను ఎవరూ మర్చిపోలేరని పేర్కొన్నారు. ప్రస్తుతం సన్నరకం వరికి కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల రైతు భరోసా పథకం క్రింద ఎకరాకు రూ.6 వేల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశామని, రైతులు పండించే అన్ని రకాల పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని వివరించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గురుకుల విద్యా సంస్థల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేసిందని, కానీ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మొదటి దశలో 4.5 లక్షల ఇండ్లు, రెండవ దశలో 2.5 లక్షల ఇండ్లు, హైదరాబాద్‌కు మరో లక్ష ఇండ్లు కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని, మూడవ, నాలుగవ విడతల్లో కూడా ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేస్తామని, ప్రొసీడింగ్స్‌తో పాటు ఇంటి నిర్మాణ పురోగతికి అనుగుణంగా బిల్లులను కూడా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి సోమవారం నిర్మాణ పురోగతిని పరిశీలించి బిల్లుల మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరికి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకతతో ఉచితంగా ప్రభుత్వం ఇళ్లను అందజేస్తుందని స్పష్టం చేశారు.ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కొత్త పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అర్హతే ఏకైక ప్రామాణికమని పేర్కొన్నారు



## మహేష్ తో మరో ఛాన్స్ కోసం సీతమ్మ వెయిటింగ్!



సూపర్ స్టార్ మహేష్ తో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడానికి బాలీవుడ్ భామ కృతి సనన్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని అమ్మడు స్వయంగా వెల్లడించారు సూపర్ స్టార్ మహేష్ తో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడానికి బాలీవుడ్ భామ కృతి సనన్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని అమ్మడు స్వయంగా వెల్లడించారు. దీంతో ఈ వార్త నెట్టింట వైరల్ గా మారింది. మహేష్‌తో జతకట్టే అవకాశం వస్తే ఎలాంటి పాత్రలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నానని మనసులోని మాటను బయటపెట్టారు. మహేష్ గనుక ఆమె కోరికను మన్నించి ఛాన్స్ ఇస్తే అది రెండవ సారి అవుతుంది. వివరాల్లోకి వెళ్తే. మహేష్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన – 1 నేనొక్కడినే– సినిమాతోనే కృతి సనన్ కథానాయికగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంలో అమ్మడి నటనకు మంచి గుర్తింపు వచ్చినా? బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేదు. ఆ సమయంలో తానొక నటిగా పరిశ్రమకు పూర్తిగా కొత్త అని కెరీర్ ఆరంభంలో సరైన అవగాహన లేని చిన్న పిల్లను అంటూ నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తొలి సినిమా చేసే సమయంలో నటనపై, ఇండస్ట్రీ పద్ధతులపై పెద్దగా అనుభవం లేకపోవడం వల్ల మహేష్ లాంటి స్టార్ హీరోతో పని చేస్తున్నప్పుడు చాలా విషయాలు గ్రహించలేకపోయానని కృతి తెలిపారు. అప్పట్లో వయసు, అనుభవం తక్కువగా ఉండటం వల్ల పెద్ద ప్రాజెక్ట్ ఇచ్చిన సువర్ణావకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయానన్నారు. కానీ బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిడం.. జాతీయ స్థాయిలో నటిగా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అవార్డును కూడా సొంతం చేసుకున్నానని కృతి గుర్తు చేస్తున్నారు. నటనపై ఇప్పుడు పూర్తి పట్టు వచ్చిందని, పరిపక్వత సాధించానని ధీమా వ్యక్తం చేసారు. ఇప్పుడు గనుక మహేష్ పక్కన నటించే మరో అవకాశం వస్తే పూర్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆ పాత్రకు పూర్తి న్యాయం చేయగలనని ఆశాభావం వ్యక్తం చేసారు. పరిణతి చెందిన నటిగా మారినందున మహేష్‌తో మరోసారి జోడీ కట్టాలని అభిమానులు కూడా కోరుకుంటున్నారు. అప్పట్లో సరైన హిట్ పడకపోయినా? ఈ క్రేజీ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయితే స్క్రీన్ మీద అదిరిపోయే కెమిస్ట్రీ వర్కౌట్ అవుతుందని కృతి అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి కృతి సనన్ కోరికను టాలీవుడ్ మేకర్స్ ... మహేష్ గుర్తిస్తారా? భవిష్యత్తులో ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందా? అన్నది చూడాలి. ప్రస్తుతం కృతిసనన్ బాలీవుడ్ లో బిజీ హీరోయిన్. చిన్న వయసులోనే జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకుని బాలీవుడ్ లో సరికొత్త రికార్డు కూడా సృష్టించారు. ఆ ఇమేజ్ తో ఉమెన్ సెంట్రిక్ చిత్రాలకు సైతం అమ్మడు ప్రమోట్ అవుతున్నారు.

## లాంగ్ డిస్టెన్స్ లవ్‌కు హ్యాపీ ఎండింగ్.. జియా శంకర్ ఎంగేజ్‌మెంట్!



ఈ ప్రత్యేకమైన వేడుకకు సంబంధించిన రోమాంటిక్ ఫోటోలను షేర్ చేస్తూ వారి సుదీర్ఘ లాంగ్–డిస్టెన్స్ లవ్ స్టోరీ గురించి ఒక ఎమోషనల్ నోట్‌ను షేర్ చేసారు. ప్రముఖ టీవీ మూవీ నటి, –బిగ్ బాస్ ఞు 2– ఫేమ్ జియా శంకర్ అధికారికంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఆగస్టు 6న సోషల్ మీడియా వేదికగా ప్రముఖ వ్యాపారవేత్త, కార్పొరేట్ ప్రొఫెషనల్ అయిన కరణ్ ధనక్‌తో తన నిశ్చితార్థం జరిగినట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేకమైన వేడుకకు సంబంధించిన రోమాంటిక్ ఫోటోలను షేర్ చేస్తూ వారి సుదీర్ఘ లాంగ్–డిస్టెన్స్ లవ్ స్టోరీ గురించి ఒక ఎమోషనల్ నోట్‌ను షేర్ చేసారు. ఈ ఆనందకరమైన వార్తను ప్రకటిస్తూ.. మనం అస్సలు ఊహించని సమయంలోనే ప్రేమ లభిస్తుందనేది నిజమేనని జియా గుర్తుచేసుకున్నారు. దేవుడు తన ఓర్పును పరీక్షించినా.. వేలాది మైళ్ల దూరంలో ఉన్నా కరణ్‌తో మాట్లాడిన ప్రతిసారీ అది తన సొంత ఇంటి వాతావరణంలా అనిపించేదని పేర్కొన్నారు. దూర భారంతో ఈ ప్రయాణం తేలికగా సాగకపోయినా.. ప్రతీ రోజూ ఇద్దరం ఒకరినొకరు ఎంచుకున్నామని వివరించారు. తన కష్ట సమయాల్లో కరణ్ నవ్వించాడని... విమానాశ్రయంలో వీడ్కోలు చెప్పే ప్రతిసారి గుండె పగిలిపోయేలా తనను హత్తుకునేవాడని జియా రాసుకొచ్చారు. కరణ్‌ను తన బెస్ట్ ఫ్రెండ్, గూఫ్‌బాల్ అని సంబోధిస్తూ తన జీవితం అతడితో ఒక అడ్వెంచర్ .. ఇష్టమైన రోమ్–కామ్ మూవీలా మారిందని అన్నారు. తన జీవితాంతం అతడితో గడపడానికి,.. అతడిని ప్రేమిస్తూ ఉండటానికి వేచి చూడలేకపోతున్నానని పోస్ట్‌లో తెలిపారు. నిశ్చితార్థ వేడుక ఫోటోలలో ఈ జంట పాస్టెల్ దుస్తులలో పరస్పరం చేతులు పట్టుకుని ఒకరినొకరు ముద్దుపెట్టుకుంటూ కెమెరాలకు ఫోజులిచ్చారు. ఎవరీ కరణ్ ధనక్? కరణ్ ధనక్ సినీ, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమకు దూరంగా ఉండే వ్యక్తి. ఆయన కార్పొరేట్ రంగంలో పనిచేస్తూనే ఒక వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. ఈ నిశ్చితార్థం ప్రకటన ద్వారానే ఈ జంట తమ సంబంధాన్ని మొదటిసారిగా అధికారికంగా బయటపెట్టారు.



అంతకుముందు ఆ ఇద్దరూ ఒకరినొకరు కలుసుకున్నారు. నటి జియా శంకర్ టెలివిజన్ పరిశ్రమలో సహాయక పాత్రలతో తన నటనా జీవితాన్ని ప్రారంభించి స్వయంకృషితో అగ్ర నటిగా ఎదిగారు. –క్యా హాల్, మిస్టర్ పాంచాల్?–, –పిశాచి 2–, పాపులర్ సబ్ టీవీ షో –కాటేలాల్ అండ్ సన్స్– వంటి విజయవంతమైన సీరియళ్ల ద్వారా గుర్తింపు పొంది బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. అనంతరం మరాఠీ హిట్ చిత్రం –వేద్–తో వెండితెరపై అడుగుపెట్టి మంచి విజయాన్ని అందుకున్న జియా –బిగ్ బాస్ ఞు 2– రియాలిటీ షోలో పాల్గొని తన నిజాయితీగల ప్రవర్తనతో డిజిటల్ ఆడియన్స్‌లో విశేషమైన పాపులారిటీని సొంతం చేసుకున్నారు. చిన్నతెర నుండి మొదలైన ఆమె ప్రయాణం సినీ రంగానికి విస్తరించి ఈరోజు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌గా.. గుర్తింపు పొందిన నటిగా తనదైన ముద్ర వేసింది.

## రంగులు మార్చే నటుడు.. ప్రకాష్‌రాజ్‌పై తణికెళ్ల భరణి కామెంట్!

ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ఇటీవల ఒక ప్రత్యేక సంభాషణలో ఒక ప్రముఖ నటుడి అసాధారణ నటనా పటిమను, భాషా ప్రావీణ్యాన్ని ఎంతో ఆప్యాయంగా కొనియాడారు. ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ఇటీవల ఒక ప్రత్యేక సంభాషణలో ఒక ప్రముఖ నటుడి అసాధారణ నటనా పటిమను, భాషా ప్రావీణ్యాన్ని ఎంతో ఆప్యాయంగా కొనియాడారు. సదరు నటుడు ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంతపు భాషను, సంస్కృతిని, ఆహార అలవాట్లను పూర్తిగా సొంతం చేసుకుంటారని, నటుల్లో అలాంటి వైవిధ్యమైన ఊసరవెల్లి(పాజిటివ్ గా) వ్యక్తిత్వం అత్యంత అరుదుగా కనిపిస్తుందని భరణి పేర్కొన్నారు. ఆ నటుడు కేవలం 33 ఏళ్ల పిన్న వయస్సులోనే మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలను సాధించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తనికెళ్ల భరణి గుర్తుచేసుకున్నారు. నల్లటి దుస్తులు ధరించి ఆయన జాతీయ అవార్డు అందుకున్న ప్రతీసారి తాను టీవీలో చూసి ఎంతో సంతోషంతో ఫోన్ చేసి అభినందించేవాడినని తెలిపారు. ఏ భాషా చిత్రంలో నటించినా.. ఆ ప్రాంత యాసను, భాషను అత్యంత శ్రద్ధతో నేర్చుకోవడం ఆయనలోని ప్రత్యేకత అని వ్యాఖ్యానించారు. ఇతర భాషల్లో నటించి సొంతంగా డబ్బింగ్ చెప్పే ధైర్యం అందరికీ ఉండదని... కానీ ఆయన తమిళం, మరాఠీ వంటి భాషల్లో కూడా ఎలాంటి లోపం లేకుండా అత్యంత స్పష్టతతో డబ్బింగ్ చెప్పగలరని భరణి ప్రశంసించారు.



ఆ లక్షణం అసలు మన దగ్గర లేదని కూడా పెదవి విరిచేసారు. తమ ఇద్దరి మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం గురించి మాట్లాడుతూ.. అతడు తమకు అత్యంత సన్నిహితుడని తెలిపారు. ప్రతిరోజూ మాట్లాడుకోకపోయినా.. వారి మధ్య ఉన్న బంధం ప్రత్యేకమైనదని.. ఆ వ్యక్తి కేవలం నటుడే కాకుండా ప్రకృతిని, కవిత్వాన్ని అమితంగా ప్రేమించే ఒక భావుకుడని అభివర్ణించారు. తమ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసే ఇటువంటి విలక్షణ నటులు చాలా అరుదుగా ఉంటారని భరణి కితాబిచ్చారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డులు సాధించడమే కాకుండా.. విభిన్న భాషా చిత్రాలలో తనదైన ముద్ర వేస్తూ సాగిన ఆ నటుడి క్రమశిక్షణ, శ్రద్ధ భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన స్పష్టం చేశారు. ఇదంతా ఎవరి గురించో గెస్ చేయగలరా? కచ్చితంగా 33 ఏళ్ల వయసులోపు 3 జాతీయ అవార్డులు అందుకున్న ప్రతిభావంతుడు కేవలం ప్రకాష్ రాజ్ మాత్రమే. అంతటి విలక్షణ నటుడు వేరొకరు లేరని కూడా దిగ్గజ రచయిత, నటుడు భరణి అంగీకరించారు. ఇటీవల రాజకీయాలతో అంటకాగడం.. రకరకాల వివాదాల కారణంగా ప్రకాష్ రాజ్ పేరు మీడియా హెడ్ లైన్స్ లోకొచ్చింది. కానీ అతడు ఎలా ఉన్నా తనకు బెస్ట్ ఫ్రెండ్ అని అంటున్నారు తణికెళ్ల భరణి. ప్రకాష్ రాజ్ సూటిగా ఉండే వ్యక్తిత్వం గురించి అతడు ప్రశంసించారు. భరణి, బ్రహ్మానందం వంటి నటులు అరేయ్ ఒరేయ్ అనేంతగా ప్రకాష్ రాజ్ కి సన్నిహితులు.

## చరణ్ కోసం సుకుమార్ ఆ బ్యూటీని తీసుకొస్తాడా..?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఇటీవల సర్జరీ చేయించుకుని, ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఆయన త్వరలోనే సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న RC17 షూటింగ్‌ను ప్రారంభిస్తాడు. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తవ్వగా, నటీనటులు మరియు ఇతర సాంకేతిక నిపుణుల ఎంపికలో చిత్రబృందం బిజీగా ఉంది. ఈ క్రమంలోనే ఈ చిత్రంలో హీరోయిన్‌గా కన్నడ భామ రుక్మిణి వసంత్ పేరు జోరుగా వినిపిస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న రుక్మిణి, ప్రస్తుతం =జ17 కోసం ఫస్ట్ ఛాయిస్‌గా ఉన్నట్లు టాక్. అయితే, త్వరలోనే దీనిపై పూర్తి క్లారిటీ రానుంది. మరోవైపు ఈ సినిమాకు సంగీత దర్శకుడిని ఖరారు చేసే పనిలో కూడా మేకర్స్ ఉన్నారట. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఫాస్ట్ షెడ్యూల్స్‌లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారట.

## భారీ సెక్యూరిటీ మధ్య ఐకాన్ స్టార్.. ఎందుకంటే..?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఏషియన్ సినిమాస్ కాంబినేషన్‌లో వైజాగ్ ఇన్ ఓర్బిట్ మాల్‌లో నిర్మించిన ~~~ సినిమాస్ ఆగస్టు 9న ప్రారంభం కానుంది. ముంబై షూటింగ్ నుండి బ్రేక్ తీసుకుని అల్లు అర్జున్ ఈ వేడుకలో స్వయంగా పాల్గొననున్నాడు.



అయితే, గతంలో సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట సంఘటనల దృష్ట్యా, భారీ సెక్యూరిటీతో కేవలం ఆహ్వానితులు, కుటుంబ సభ్యుల మధ్య ప్రైవేట్‌గా ఈ ఈవెంట్ నిర్వహించనున్నారు ఆర్గనైజర్స్. ప్రారంభ వేడుకలో సామాన్య జనాలకు ఎంట్రీ ఇవ్వకూడదని.. అల్లు అర్జున్ పర్యటన ముగిశాకే ఇతరులకు లోనికి అనుమతి ఇవ్వాలని ఆర్గనైజర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## రామాయణ ట్రైలర్.. మళ్ళీ కొత్తగా.. 100 కోట్ల వ్యూస్

బాలీవుడ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ రామాయణ ఇప్పుడు



సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో హైలెట్ అవుతోంది. బాలీవుడ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ రామాయణ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో హైలెట్ అవుతోంది. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా దీపావళికి థియేటర్లలోకి రానుంది. వారం క్రితం జూలై 30న రిలీజైన ఈ మూవీ ట్రైలర్ ఒక క్యూరియాసిటిని క్రియేట్ చేసింది. ఇక వచ్చిన రెస్పాన్స్ చూసి ఇండస్ట్రీ జనాలు షాక్ అవుతున్నారు. ట్రైలర్ రిలీజైన కేవలం వారం రోజుల్లోనే ఏకంగా 100 కోట్ల వ్యూస్ మార్క్ దాటేసింది. ఇండియన్ సినిమాలో ఒక ట్రైలర్ కు ఈ రేంజ్ లో బిలియన్ వ్యూస్ రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఈ వీడియోను ఉహించని స్థాయిలో షేర్ చేయడంతో ప్రతి ప్లాట్‌ఫామ్ లో ఇదే గట్టిగా ట్రెండ్ అయింది. ఈ బిలియన్ వ్యూస్ రికార్డు సెలబ్రేషన్స్ లో భాగంగా మేకర్స్ ఈ రోజు ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ ట్రైలర్ ను ఏఐ ఎన్హాన్స్ లిప్ సింక్ టెక్నాలజీతో అప్‌డేట్ చేసి మళ్లీ ఆడియన్స్ ముందుకు తెచ్చారు. ఏఐ టెక్నాలజీ ఉపయోగించి ఆర్టిస్టుల డైలాగ్స్ కి తగ్గట్టుగా పెదాల కదలికలను సెట్ చేశారు. మొదట ట్రైలర్ పై కొంత టాక్ బిన్నంగా ఉన్నప్పటికీ ఇప్పుడు పర్ఫెక్ట్ గా మరో లెవెల్లో హైలెట్ అయ్యింది. సాధారణంగా వేరే భాషల్లోకి డబ్ చేసినప్పుడు మాటలు ఒకలా, పెదాల మూమెంట్స్ ఇంకోలా కనిపిస్తుంటాయి. కానీ ఈ ఏఐ టెక్నాలజీ వల్ల ఆ ప్రాబ్లమ్ కవర్ అయింది. ఏ లాంగ్వేజ్ లో చూసినా సరే, ఆ నటీనటులు సొంతంగా అదే భాష మాట్లాడినట్లే చాలా నాచురల్ గా అనిపిస్తోంది. డబ్బింగ్ ఫీలింగ్ అస్సలు రావడం లేదు అనే కామెంట్స్ వస్తున్నాయి. ఈ కొత్త ఏఐ వర్క్ చూసిన ఆడియన్స్ నుంచి సోషల్ మీడియాలో మంచి కాంప్లిమెంట్స్ వస్తున్నాయి. డైలాగ్స్ మరింత క్లియర్ గా, సహజంగా ఉ ండటంతో ట్రైలర్ ఇంపాక్ట్ రెట్టింపు అయిందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. థియేటర్లలో కూడా ఇదే క్వాలిటీతో సినిమా ఉంటే చూసేటప్పుడు మంచి విజువల్ ఎక్స్ పీరియన్స్ దొరుకుతుందని ఫ్యాన్స్ అంటున్నారు. నమిత్ మల్హోత్రా, నితేష్ తివారీ ఈ సినిమాను హాలీవుడ్ రేంజ్ లో ప్లాన్ చేశారు. ప్రమోషన్స్ విషయంలో కూడా ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా గ్లోబల్ ఆడియన్స్ ని టార్గెట్ చేస్తున్నారు. 100 కోట్ల వ్యూస్ తో ఊపు మీదున్న ఈ రామాయణ ప్రాజెక్ట్ దీపావళికి రిలీజ్ అయ్యాక ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555